# ముష్టివాళ్ళని విసిరికొట్టకు



ప్రతాప రవిశంకర

**మనసు** బాగో లేదు. అవును. దిగులుగా ఉన్నది. బాధగా ఉన్నది. భయంగా, ఆందోళనగా ఉన్నది.

ఇప్పుడేమిటి చెయ్యటం? ఇంతకు మించిన అవకాశం లేదు. మళ్ళీ రాదు. గోల్డెన్ ఆపర్చ్యూనిటీ. ఇది జీవిత భవిష్యత్తుకు సంబంధించిన సమస్య. ఈ అవకాశాన్ని జార విడుచుకుంటే జీవితాంతం బాధపడవలసి రావచ్చు.

ఈ గొడవంత నా తమ్ముడు రాజశేఖరం ఉద్యోగం గురించే. వాడు మూడేళ్ళ క్రితం డిగ్రీ పూర్తి చేశాడు. అప్పటినించీ ఉద్యోగాల వేటలో పడిపోయాడు. కాని, ఏం లాభం? కుందేలు పిల్లలాంటి చిన్న ఉద్యోగం కూడా దొరకలేదు. రకరకాల పరీక్షలకు, ఇంటర్వ్యూలకు హాజరవుతూనే ఉన్నాడు. ఐనా ఇప్పటివరకూ నిరుద్యోగిగానే ఉండిపోయాడు.

అయితే అనుకోని విధంగా ఇప్పుడు వాడికో అవకాశం వచ్చింది. నెల రోజుల క్రితం వాడు బాగా పేరున్న ఓ ప్రయివేట్ కంపెనీలో ఎక్కౌంటెంట్ ఉద్యోగాలకు ఖాళీలు ఉన్నాయని తెలిసి దరఖాస్తు పెట్టాడు. రెండు రోజుల క్రితమే వాళ్ళు పెట్టిన పరీక్షకు కూడా హాజరయ్యాడు. అప్పుడు ఆ కంపెనీలోనే పనిచేస్తున్న మా దూరపు బంధు ఒకాయన మా వాడిని పలకరించి ఓ రహస్యం చెప్పాడుట.


ఆ రహస్యం — ఓ ఐదు వేలు లంచం ఇవ్వగలిగితే ఆ కంపెనీలో ఖాయంగా ఆయన ఉద్యోగం ఇప్పించగలనని చెప్పాడుట.

ఐదువేలు ఇస్తేనేం? మంచి ఉద్యోగం. నెలకు ఏడువందల జీతం. కాకపోతే ఓ పది నెలలు జీతం లేకుండా ఉద్యోగం చేశా మనుకుంటే సరిపోతుంది. నిజమే—అంతా బాగానే ఉన్నది కాని, నా దగ్గరే అసలు డబ్బు ఏమీ లేకుండా పోయింది. ఆఫీసులో ఏదయినా లోన్‌కి అప్లయ్ చేసే టైముకూడా లేదు. వారం రోజుల లోపల డబ్బు తీసుకు రాగలిగితే ఆ ఉద్యోగం ఇప్పించగలనని అన్నాడుట ఆయన. వారం తర్వాత పదివేలు తీసుకువచ్చినా ప్రయోజనం ఉండదని గట్టిగా చెప్పాడుట.

ఇప్పుడేమిటి చెయ్యటం? వందో, రెండొందలో అయితే ఎవరయినా వెంటనే ఇస్తారు. ఒక్కసారిగా వేలు కావాలంటే ఎవరుమాత్రం ఇస్తారు? అయినా ప్రయత్నించటంలో తప్పులేదు కాబట్టి నాకు బాగా తెలిసి ఓ నలుగుర్ని అడిగి చూశాను. ఎవ్వరూ కనీసం వెయ్యి రూపాయలు కూడా ఇస్తానని అనలేదు.

కేవలం ఉద్యోగం కోసమే డిగ్రీ వరకు చదివి, తీరా ఓ ఐదు వేలకు ఉద్యోగం దొరికే అవకాశం వచ్చినప్పుడు డబ్బులేకపోవడం ఎంతటి దురదృష్టం! ఐనా నేను ఈ అవకాశాన్ని అంత సులభంగా వదల దల్చుకోలేదు.

తెనాలిలో నాకు దగ్గిర బంధు ఒకాయన ఉన్నాడు. ఆయనకు బాగానే ఆస్తి ఉంది. తరచు నేను వాళ్ళింటికి వెళుతూనే ఉంటాను. విషయమంతా చెప్పి ఆయన్నే ఆ డబ్బు అడుగుదా మనుకుని ఉదయమే రైల్లో తెనాలి వెళ్ళాను.




ఆయన ఇంట్లోనే ఉన్నాడు. కొంచెం సేపటికి తర్వాత నే నెందుకు వచ్చినదీ ఆయనతో చెప్పాను.

"ఆహా! అద్భుతమైన అవకాశం. అసలు ఐదు వేలకు ఈ రోజుల్లో ఐదొందలు వచ్చే ఉద్యోగం కూడా దొరకటం లేదు. నువ్వు ఈ అవకాశాన్ని వదులుకోవద్దు" అన్నాడు.

"అందుకే నీ దగ్గరకు వచ్చాను, మామయ్యా!' ఓ ఐదువేలు అవసరానికి ఇచ్చావంటే నెలకు ఐదు వందలు ఇస్తాను. ఇక నువ్వు తప్పించి ఎవ్వరూ ఇవ గలిగిన స్థితిలో లేరు. వాడు ఇప్పటికే ఉద్యోగం లేటని దిగులుపడిపోయాడు" అన్నాను.

"నిజమేరా. వయసొచ్చిన ఆడపిల్లకు పెళ్ళి అవక పోయినా, డిగ్రీ పూర్తిచేసిన మగాడికి ఉద్యోగం రాక పోయినా తప్పకుండా దిగులు పడతారు. కాని, నువు ఓ పది రోజుల క్రితం వచ్చినట్లయితే బావుండేది. మా పొలం చేసే రైతు ఎరువులు కొనాలని అడిగితే నాలుగువేలు ఇచ్చాను. ఇప్పుడు నా దగ్గర ఓ వంద రూపాయలకు మించి లేవు" అన్నాడు నసుగుతూ.

ఖాళీ. ఆఖరి ఆశ కూడా ఎగిరిపోయింది. ఆయన అబద్ధం చెబుతున్నాడని నాకు తెలుసు. ఆయన ఓ నెల రోజుల క్రితమే ఆ వూర్లోనే ఉన్న ఆయన స్థలాన్ని నలభై వేలకు అమ్మాడు. ఇంతకీ ఆయనకు నాకు సహాయం చెయ్యడం ఇష్టంలేదు. ఈయన నాకు బంధువు.

ఇక నా తమ్ముడి ఉద్యోగం గురించి పూర్తిగా అవకాశం వదులుకున్నాను. ఆయన ఆ సాయంత్రం వరకు ఉండమన్నా వినకుండా బయల్దేరాను.

ఇంకో రెండు గంటలవరకు రైలు లేదు. అందుకే బస్సుకు వెళ్ళాలనుకుని నడవటం మొదలుపెట్టాను.

ఎదురొస్తున్న వాహనాలను తప్పుకొంటూ ఆలోచిస్తూ నడుస్తున్నాను.

బస్టాండుకు దగ్గరగా వచ్చాను.

ఇంతలో నా వెనుక నుంచి "బాబూ, బాబూ" అంటూ పిలిచారు.

వెనక్కు తిరిగాను.

ఎవరో ఒకాయన పరిగెత్తుకొంటూ నా దగ్గరకు వచ్చాడు. గ్లాస్కో పంచె, చొక్కా వేసుకొన్నాడు. చేతికి పెద్ద వాచీ ఉంది. చేతులకు రెండు బంగారు ఉంగరాలు ఉన్నాయి.

"మీ కోసమే రోజూ వూరంతా వెతుకుతున్నాను, బాబూ!" అన్నా డాయన వచ్చి.

"నాకోసమా? ఎందుకు— ఇంతకీ మీ రెవరు?" అన్నాను.

"నేను బాబూ ... ముష్టోడిని. నన్ను గుర్తు పట్టలేదా. అవున్లెండి. అప్పుడు నాకు బాగా గెడ్డాలు ఉండేవి. చేతిలో బొచ్చె ఉండేది" అన్నాడు.

"నువ్వు ముష్టివాడివా?!" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును, బాబూ! ఇప్పుడు నా దశ తిరిగిపోయింది అన్నాడు.

అప్పుడు వాడిని గుర్తు పట్టాను. అతను... వాడు తెనాలి బస్టాండులో అడుక్కునే వాడు. చాలాసార్లు నేను వాడికి చిల్లర పైసలు ఇచ్చాను.

వాడు అప్పటికే రోడ్డు మీద ఖాళీగా వెడుతున్న ఆటో రిక్షాను ఆపి "ఎక్కండి, బాబూ" అన్నాడు.

"ఎక్కడికి?" అన్నాను కంగారుగా.

"మా ఇంటికి వెళదాం, బాబూ! ముందు తమరు ఎక్కండి" అన్నాడు నన్ను తొందరపెడుతూ.

యాంత్రికంగా ఎక్కాను.

"మూడు నెల్లనించీ మీ కోసం వెతకని రోజు లేదు, బాబూ! అంతా మీ చలవే. నా అదృష్టం తిరిగి పోయింది. మా ఆడదానిక్కూడా మీ గురించి చెప్పాను. అది కూడా ఎక్కడ కనపడినా మిమ్మల్ని ఇంటికి తీసుకు రమ్మన్నది" అన్నాడు.

ఆటో ఓ చిన్న ఇంటి ముందు ఆగింది.

కొత్తగా కట్టిన చిన్న డాబా.

జేబులోంచి పది రూపాయలు తీసి ఆటో డ్రైవర్‌కి ఇచ్చి— "ఇక్కడే ఉండు. మళ్ళీవస్తాం" అని చెప్పి నన్ను ఇంట్లోకి తీసుకెళ్ళాడు.

"రండి, బాబూ" అని నన్ను వదిలి గబగబా లోపలకు పరుగుదీసి వాడి భార్యను తీసుకువచ్చాడు.

"ఈ బాబుగారేనే నాకు ఆ రోజు ఆ డబ్బు ధరమం చేసింది. బంగారం వంటి చెయ్యి" అన్నాడు.

వాడి భార్య నాకు దణ్ణం పెట్టింది.

"అంతా చెప్పావా, మావా!" అన్నది.

"కూర్చోండి, బాబూ!" అని నేను కూర్చున్న తర్వాత అసలు విషయం చెప్పాడు వాడు.

ఐదు నెల్ల క్రితం నేను తెనాలి బస్సుస్టాండులో దిగి బయటకు వెళుతూ అతనికి నా దగ్గర చిల్లర పైసలు లేని కారణంగా బాగా మురికి పట్టి చిరిగి పోవడానికి సిద్ధంగా ఉన్న ఓ రూపాయినోటు ఉంటే దాన్ని ముష్టి వాడికి ఇచ్చి వెళ్ళిపోయాను. వాడు అప్పటికప్పుడే ఆ రూపాయితో ఓ లాటరీ టిక్కెట్టు కొన్నాడుట. దానికే వాడికి రెండు లక్షలు వచ్చాయిట లాటరీలో — అంతే వాడి స్థితి మారిపోయింది.

అదంతా వినగానే నాకు గుండె ఆగిపోతుందేమో అనిపించింది. నేను చెల్లదని ధర్మం చేసిన రూపాయి లాటరీలో ఆ ముష్టివాడికి రెండు లక్షలు సంపాదించి పెట్టిందా?

నేనా షాక్‌లోనించి తేరుకోకముందే అతను లోప లకు వెళ్ళి డబ్బుతో తిరిగివచ్చి, "బాబూ! ఇదంతా మీ చలవే. ఏదో నా సంతోషం కొద్దీ ఈ డబ్బును మీ దగ్గర ఉంచండి" అంటూ ఆ డబ్బును నాకు ఇవ్వబోయాడు.

"నా కెందుకు?" అన్నాను గబుక్కున.

"అట్టా అనకండి, బాబూ ... మీరు ఆ రోజు దయతో ఆ రూపాయి ఇవ్వక పోయినట్టయితే నే నింకా అక్కడే ముష్టోడిగా అడుక్కుతింటూ ఉండేవాడిని. మీరు నా జాతకాన్నే మార్చేశారు. కాదనకండి. ఈ పదివేలూ సంతోషంగా తీసుకోండి" అన్నాడు.

ఇక నేను కాదనలేకపోయాను. అతనికి నా పట్ల ఉన్న కృతజ్ఞతకు నాకు ఆశ్చర్యం కలిగింది. పాలు పోసిన మనిషినే కాటేసే పాముల్లాంటి మనుషులున్న ఈ సమాజంలో ఇలాంటి విశ్వాసం ఉన్న మనుషులు కూడా ఉంటారని అప్పుడే తెలిసింది.

ఆ డబ్బును జేబులో పెట్టుకున్నాను. లేచి నిల్చున్నాను. వెళుతున్నానని చెప్పి బయటకు వచ్చాను. అతను నన్ను ఆటోలో ఎక్కించాడు.

మరోసారి వాళ్ళిద్దరూ నాకు దణ్ణాలు పెట్టారు.

ఆటో బయలుదేరింది. ఎందుకో నాకు కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. వూహించని విధంగా నా సమస్యకు పరిష్కారం దొరికింది. నిజానికి నేను ఆ ముష్టివాడికి చేసింది ఏదీ లేదు. కానీ ఆ ముష్టి వాడు నాకు జన్మలో మరిచిపోలేని ఉపకారం చేశాడు. నా తమ్ముడి జీవితానికి పువ్వుల బాట పరిచాడు.

ఇప్పుడు నా మనసు బాగా ఉంది. అవును. దిగులుగా లేదు. బాధగా, భయంగా, ఆందోళనగా లేదు. గాలిలో తేలిపోతున్నట్టుగా ఉన్నది. ●